నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, శనివారం 30 మార్చి 2024 VIKARABAD

# పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం




- ఇప్పటికే ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి
- 5028 పీవో, ఏపీవో, ఓపీవోల నియామకం
- ఏప్రిల్ రెండోవారంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ
- ఈవీఎంలు సిద్ధం.. ఏప్రిల్ 4న ఆయా నియోజకవర్గాలకు తరలింపు
- ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం
- వికారాబాద్ జిల్లాలో 9,84,068 మంది ఓటర్లు

వికారాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే షెడ్యూల్ విడుదలకాగా, ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణ, ఈవీఎంలను సిద్ధం చేసే పనిలో జిల్లా ఎన్నికల అధికారులు నిమగ్నమయ్యారు. ఓటరు తుది జాబితాతోపాటు ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్(ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియను అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తి చేశారు. రెండో దశ ఈవీఎంల పరిశీలన పూర్తి చేసి ఏప్రిల్ 4న ఆయా నియోజకవర్గాలకు ఈవీఎంలను తరలించనున్నారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి రానుండగా, కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఆయా నియోజకవర్గాలకు సరిపోను ఈవీఎంలు, సిబ్బందిని సిద్ధం చేశారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాలతోపాటు పరిగి నియోజకవర్గంలోని గండీడ్, మహ్మదాబాద్ మండలాలకు ఎన్నికల సిబ్బందిని మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల అధికారులు నియమించనున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, ఓపీవోలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చే ప్రక్రియతోపాటు ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. ఏప్రిల్ రెండోవారం తర్వాత ఎన్నికల విధుల్లో పాల్గొనే 1257 మంది పీవోలు, 1257 మంది ఏపీవో, 2514 మంది ఓపీవోలకు శిక్షణనిచ్చేలా జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలోని 1133 పోలింగ్ కేంద్రాలకు అదనంగా ఈవీఎంలను సమకూర్చేందుకుగాను ఈవీఎంలు తక్కువ పడ్డాయి. దీంతో మరో 275 ఈవీఎంలు ఈసీఐఎల్ సంస్థ నుంచి జిల్లాకు తీసుకొచ్చారు. ప్రస్తుతం జిల్లాలో బ్యాలెట్ యూనిట్లు-2267, కంట్రోల్ యూనిట్లు-1694 ఉండగా, వీవీప్యాట్లు-1791 ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఎంపీ ఎన్నికలకు ఓటర్లు పెరిగిన దృష్ట్యా పోలింగ్ కేంద్రాల పెంపునకుగాను తాండూరు నియోజకవర్గంలో 8 కేంద్రాలు, కొడంగల్ నియోజకవర్గంలో 7 పోలింగ్ కేంద్రాలను పెంచేందుకు ఎన్నికల సంఘానికి జిల్లా ఎన్నికల అధికారులు ప్రతిపాదనలను పంపారు. ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**ఓటరు నమోదుకు ఏప్రిల్ 15 వరకు చాన్స్..**

ఇంకా ఓటరుగా నమోదు చేసుకోలేని వారికి ఎన్నికల సంఘం మరో అవకాశమిచ్చింది. ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు గడువు ఇచ్చింది. మీసేవా, ఆన్‌లైన్ ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్ తాండూరు నియోజకవర్గాల్లో మొత్తం 9,84,068 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 4,86,109 మంది, మహిళలు 4,97,920 మంది, ఇతరులు 39 మంది ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా పరిగి నియోజకవర్గంలో 2,66,273 మంది ఓటర్లుండగా పురుషులు 1,33,625 మంది, మహిళలు 1,32,639 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,31,679 మంది కాగా, ఇందులో పురుషులు 1,15,019 మంది, మహిళలు 1,16,647 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. తాండూరు నియోజకవర్గంలో 2,43,849 మంది ఓటర్లకుగాను పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614 మంది, ఇతరులు 7 మంది ఉన్నారు. అదేవిధంగా కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,42,267 మంది కాగా, పురుషులు 1,19,237 మంది, మహిళలు 1,23,020 మంది, ఇతరులు 10 మంది ఉన్నారు.



**సన్నాహక సమావేశాలతో బీఆర్ఎస్ ప్రచార జోరు...**

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించేలా బీఆర్ఎస్ పార్టీ పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ముఖ్య నేతలతో సమావేశమై గెలుపుపై దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవంతోపాటు మంచి పేరున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రంగంలోకి దింపడంతో గెలుపు పక్కా అనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని పరిగి నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం పూర్తికాగా, ఈ నెల 30న తాండూరు, ఏప్రిల్ 3న వికారాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగనున్నది. అదేవిధంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యతను ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టున్న ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డికి అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. దీంతో పక్కా వ్యూహంతో సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

## నేడు తాండూరులో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం



- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్టీ శ్రేణులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పిలుపు

తాండూరు, మార్చి 29 : పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు దూకుడు పెంచాయి. శనివారం తాండూరు సమీపంలోని జీపీఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చేవెళ్ల బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు ముఖ్య నేతలు హాజరు కానున్నట్లు తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. తాండూరు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ రోడ్డు కందనెల్లి సమీపంలోని జీపీఆర్ గార్డెన్‌కు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.



శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, కాలె యాదయ్య, గాంధీ, ఎమ్మెల్సీ దయానందగుప్తా, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

# కాంగ్రెస్‌కు ఓటేసినందుకు బాధపడుతున్నారు

## మోసగాళ్లకు బుద్ధిచెప్పి బీఆర్ఎస్ సత్తా చాటుదాం..

- చేవెళ్ల ఎంపీగా కాసానిని గెలిపించుకుందాం
- పట్నం, రంజిత్‌రెడ్డిలకు బుద్ధి చెప్పాల్సిందే..
- ఆస్కార్ లెవల్‌లో నటించి.. వెన్నుపోటు
- 13న చేవెళ్లలో జరిగే బహిరంగ సభను సూపర్ హిట్ చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎన్నికల్లో కార్యకర్తలు సత్తా చూపించాలి : సబితా ఇంద్రారెడ్డి
- రోజురోజుకూ మద్దతు పెరుగుతున్నది : కాసాని జ్ఞానేశ్వర్



రంగారెడ్డి, మార్చి 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని..ప్రతి ఒక్కరూ ఆ పార్టీకి ఎందుకు..ఓటు వేశామా.. అని బాధపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ' బీఆర్ఎస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎంపీగా అవకాశం ఇస్తే.. నిలబడతానని ముందుకొచ్చిన ధీరోదత్తుడు కాసాని జ్ఞానేశ్వర్' అని కొనియాడారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీసీల కోసం జీవితాన్ని త్యాగం చేసి కష్టపడ్డ గొప్ప నాయకుడు కాసాని అని అన్నారు. కేకే, కడియం వంటి పెద్ద పెద్ద నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో కష్టకాలంలో మనకోసం వచ్చిన కాసానిని కడుపులో పెట్టుకొని చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిలబడ్డది కేసీఆర్ అని భావించి.. కమిట్‌మెంట్‌తో ఓటు వేసి కాసానిని చేవెళ్ల ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

**ఆ ఇద్దరినీ పార్టీలోకి రానిచ్చేది లేదు..**

కష్టకాలంలో పట్నం మహేందర్ రెడ్డి, రంజిత్ రెడ్డి పార్టీకి వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ విమర్శించారు. చేవెళ్ల, పరిగిల్లో నిర్వహించిన సమావేశాల్లో ఇద్దరు నేతలు పార్టీని వీడేది లేదని ఆస్కార్ లెవల్‌లో నటించారని, పదిహేను రోజుల తర్వాత ఇద్దరు నేతలు పత్తాలేకుండా పోయారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు. జిల్లాకు సంబంధం లేని రంజిత్ రెడ్డికి ఎంపీగా అవకాశమిస్తే కేసీఆర్ మనిషిగా కార్యకర్తలు గెలిపించినప్పటికీ పార్టీని వీడి ద్రోహం చేశారన్నారు. 'పట్నం, రంజిత్ రెడ్డిలు కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా..బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మళ్లీ..ఆ ఇద్దరినీ పార్టీలోకి రానిచ్చేది లేదు' అని స్పష్టం చేశారు. 2014లో స్వయంగా విశ్వేశ్వర్ రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించి ఎంపీగా గెలిపించినప్పటికీ ఆయన 2018లో వేరే పార్టీలోకి జంప్ అయ్యారని విమర్శించారు. కేకే, కడియం వంటి పెద్ద పెద్ద నాయకులు కష్ట కాలంలో పార్టీని వదిలి వెళ్తున్నారని, అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందన్నారు.

**ప్రభుత్వాన్ని కూల్చేది నల్లగొండ, ఖమ్మం బాంబులే**

రేవంత్ ప్రభుత్వం ఐదేండ్లు ఉండాలని కోరుకుంటున్నామని, కానీ..కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేది నల్లగొండ, ఖమ్మం బాంబులేనని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఇచ్చిన 30వేల ఉద్యోగాలను తన ఖాతాలో వేసుకున్న రేవంత్‌పై యువత కోపంగా ఉందన్నారు. ఇప్పటికే నాలుగు నెలలు గడిచిపోయాయని, వచ్చే ఎనిమిది నెలల్లో 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి ఎన్నికల నాటి హామీని రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు ప్రశ్నించకుండా వారి దృష్టి మరల్చేందుకే ఫోన్ ట్యాపింగ్, స్కాములు అంటూ యూట్యూబ్‌లలో అసత్య ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు పోయి ఆరు గారడీలు వచ్చాయని విమర్శించారు.

**పంటలు ఎండిపోతున్నా.. పట్టించుకోవడం లేదు..**

పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతులకు 2 లక్షల రుణ మాఫీ చేయలేదని, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, పెంచిన ఆసరా పింఛన్లను ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. 17 ఎంపీ సీట్లలో బీఆర్ఎస్ ఆరుగురు బీసీలకు టికెట్లను ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్‌రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, యువ నేత కార్తిక్ రెడ్డి, నాయకులు అవినాశ్ రెడ్డి, పర్యాద కృష్ణారెడ్డి, నాగేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## 13న భారీ బహిరంగ సభ

లోక్ సభ సమరానికి భారత రాష్ట్ర సమితి దూకుడు మీదున్నది. జనవరి నుంచే చేవెళ్ల పార్లమెంటు ఎన్నికపై నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలను నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ, ఏప్రిల్ 13న భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నది. ఈ వేదిక నుంచే ఎన్నికల క్యాడర్‌లో సమరోత్సాహాన్ని నింపాలని పార్టీ అధినేత కేసీఆర్ సంకల్పిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించి బీఆర్ఎస్ సత్తా చాటాలని నేతలు భావిస్తున్నారు. ఏప్రిల్ 6న తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహిస్తుండడంతో అంతకుమించి అన్న రీతిలో బీఆర్ఎస్ సభ ఉండేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌లో మరింత జోష్‌ను నింపాయి.

## ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ వెంటే

- సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి



మార్పు తెస్తామని చెప్పినట్లుగానే కాంగ్రెస్ వచ్చాక కరెంటు లేదు. పంటలు ఎండిపోతున్నయ్. పండుగలకు గిఫ్టులు లేవు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పండుగలు వస్తున్నాయంటే నెల రోజుల ముందే కేసీఆర్ మమ్మల్నందరినీ అప్రమత్తం చేసేవారు. కేసీఆర్ విలువ ఇప్పుడిప్పుడే ప్రజలకు తెలుస్తున్నది. 111జీవోను ఎత్తేయించింది నేనే అని రంజిత్ రెడ్డి అంటున్నారు. ఆ జీవో గురించి రంజిత్ రెడ్డి ఒక్కసారైనా అడిగిన పాపాన పోలేదు. కేసీఆర్ సైన్యం అంటే ఏమిటో ఈ ఎన్నికల్లో కార్యకర్తలు చూపించాలి. నాపై కూడా కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ వెంటే ఉంటా.

## సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా



పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అందరం కలిసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం. ఒక్కో నాయకుడు వంద ఓటర్లు చొప్పున చొరవ తీసుకుని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి.

## సేవ చేసే భాగ్యం కల్పించండి

-కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి



సబ్బండ వర్ణాల కోసం దశాబ్దాలుగా సేవ చేస్తున్నా. నాకు టికెట్ ఖరారైనప్పటి నుంచి మద్దతుగా ఉపాధ్యాయుల నుంచి పెద్ద ఎత్తున ఫోన్లు వస్తున్నాయి. ఆశీర్వదించండి. మీకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

## వారికి ఓటమి తప్పదు

-ఎమ్మెల్యే గాంధీ



బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు అవకాశం పొందిన నేతలు.. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో వేరే పార్టీల నుంచి బరిలోకి దిగారు. వారికి ఓటమి తప్పదు. రెండు పర్యాయాలుగా చేవెళ్ల అడ్డా గులాబీదే.. ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగురుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నది.

## ఓటుతోనే తగిన బుద్ధి చెబుదాం

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



కేసీఆర్ తయారు చేసిన వాళ్లందరూ పదవులు, ఆస్తులను కాపాడుకోవడానికి ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడం కార్యకర్తలతోనే సాధ్యమవుతుంది. ఒకరిద్దరు నాయకులు పార్టీని వీడితే నష్టమేమీలేదు. కొత్తవారు ఎంతోమంది తయారవుతారు. పార్టీ కోసం పనిచేసిన వారికి మంచి అవకాశాలు వస్తాయి.

## కాసానిని గెలిపించుకుందాం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. 70 ఏండ్ల కాలంలో ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చినా తాగునీటి గురించి పట్టించుకోలేదు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా నీరు అందించారు. ప్రస్తుత ప్రభుత్వానికి కేసీఆర్ ఇచ్చిన నీళ్లు కూడా సరఫరా చేయడానికి చేతకావడం లేదు.

## బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయం. చేవెళ్ల ఎంపీగా బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం ప్రతి కార్యకర్త కష్టపడాలి. బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలి. కాంగ్రెస్ వైఫల్యాలను జనంలోకి బలంగా తీసుకెళితే బీఆర్ఎస్ గెలుపు తథ్యం. సమన్వయంతో పనిచేసి గెలుపు తీరాలకు చేర్చుదాం.

## ఢిల్లీలో గొంతు వినబడాలంటే..

కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే



ఢిల్లీలో తెలంగాణ గొంతు వినిపించాలంటే బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు కచ్చితంగా గెలవాలి. సమన్వయంతో పనిచేసి సత్తాచాటుదాం. అందరం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే, పార్టీ నుంచి వెళ్లిన నాయకులకు బుద్ధి చెప్పిన వాళ్లమవుతాం.

# ఎండ@41 డిగ్రీలు

**రంగారెడ్డి జిల్లాలో మండుతున్న ఎండలు..భానుడి ప్రతాపానికి ఇండ్లకే పరిమితమవుతున్న జనం**





వాహనాల రద్దీ లేకుండా నిర్మానుష్యంగా మారిన వికారాబాద్ నుంచి సదాశివపేటకు వెళ్లే రోడ్డు

షాబాద్, మార్చి 29 : రోజురోజుకూ ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు ఇండ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం 9గంటల నుంచే సూరీడు భగభగ మండుతున్నాడు. వరుసగా గత నాలుగు రోజుల నుంచి రంగారెడ్డి జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 నుంచి 40డిగ్రీలు నమోదవుతున్నాయి. శుక్రవారం ఏకంగా 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండకు తాళలేని ప్రజలు కొబ్బరిబొండాలు, శీతలపానీయాలు తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముమ్ముందు ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల కారణంగా జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండ దెబ్బ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.





ఎండలు తీవ్రం కావడంతో జనం లేక బోసిపోయిన చేవెళ్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రోడ్డు